క్లుప్తంగా

న్యూ ఇయర్ వేడుకలకు దూరం


కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: న్యూఇయర్ వేడుకలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండనని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం తెలిపారు. కొత్త సంవత్సరంలో నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ


పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కోవెలకుంట్ల: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో హాస్టల్‌లోని 70 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకట్రాముడు, సభ్యులు బాలాంజనేయరెడ్డి, శివ, హాస్టల్ వార్డెన్ చైతన్యలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరానికి తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన 251 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూటుపల్లె సర్వేయర్ మృతి


మధు కేశాలు (ఫైల్)

బేతంచెర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామ సర్వేయర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మండల పరిధిలోని గూటుపల్లె గ్రామ సర్వేయర్ మధు కేశాలు(47) ఈ నెల 26వ తేదీ బేతంచెర్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. మృతిపై తహసీల్దార్ ప్రకాశ్ బాబు, డీటీ మారుతి, ఆర్‌ఐలు, వీర్వోలు సంతాపం తెలిపారు.

వాల్‌పోస్టర్ల విడుదల

డోన్ టౌన్: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆదివారం వినియోగదారుల రక్షణపై ముద్రించిన వాల్ పోస్టర్లను ఆర్డీఓ నరసింహులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల రక్షణ, హక్కులపై స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, కన్వీనర్ జయమనోజ్‌కుమార్ బాబు, రవికుమార్ పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేద్దాం

బేతంచెర్ల: డోన్ ఈ నెల ఈనెల 31న జరగనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. ఆదివారం బేతంచెర్లలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జయప్రదం చేయాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, సహాయ కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

డోన్: పట్టణంలోని చిగురుమానుపేటకు చెందిన కోరి తిమ్మక్క కుమారులు చిన్న ఆంజనేయులు, పెద్ద ఆంజనేయులు స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు శర్మ, శివరామ్మూర్తితో పాటు దాత తిమ్మక్క కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాపరాతి పరిశ్రమను కాపాడుకుందాం

- పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేసేలా పోరాటం
- ఇందు కోసం పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యం కావాలి
- బేతంచెర్ల నగరపంచాయతీ చైర్మన్ చలంరెడ్డి


బేతంచెర్లలో నాపరాళ్ల పరిశ్రమల యజమానులు చేపట్టిన రిలే దీక్షల్లో మాట్లాడుతున్న చలంరెడ్డి

బేతంచెర్ల: నాపరాతి పరిశ్రమను కాపాడుకోవడానికి పార్టీలకు అతతీంగా అందరూ ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, పరిశ్రమల యజమానులు బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలీ, తెలుగు రమణ, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి అన్నారు. నాపరాతి గనులకు పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలని పరిశ్రమ యజమానులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 3వ రోజుకు చేరుకుంది. గనులు, పరిశ్రమలు, లారీ, ట్రాక్టర్ యజమానులతో పాటు డ్రైవర్లు, కార్మికులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్నారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాపరాతి పరిశ్రమ బతికి బయటపడాలంటే తప్పనిసరిగా పాత పద్ధతిలోనే రాయల్టీలను మంజూరు చేయాలన్నారు. లేకపోతే గనుల యజమానులతో పాటు వేలాది మంది కార్మికులు రోడ్డున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న తరహా పరిశ్రమ అయిన నాపరాయికి ప్రభుత్వం రాయితీలు కల్పించి ఆదుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు ఇక్కడి పరిస్థితులను తెలుసుకుని నాపరాతి పరిశ్రమను బతికించాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో నాపరాయి పరిశ్రమపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారని గుర్తు చేశారు. ప్రత్యక్షంగా పరోక్షంగా నాపరాతి గనులు, పరిశ్రమలు, డిపోలు, ట్రాక్టర్, లారీలపై 15 వేల నుంచి 20 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల వీరంతా ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పరిశ్రమల యజమానులు నాగేశ్వరరెడ్డి, మోహన్‌రావు, రాంబాబు, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎర్రబాషా, ఉపేంద్ర, శేక్షావలి చౌదరి, మురళీ, బాబు పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రం అందుకుంటున్న రమ్య

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థిని రమ్య ఆదివారం కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పరీక్షల్లో 2వ బహుమతి సాధించింది. ఉపాధ్యాయులు నర్ల రవి కుమార్ రెడ్డి, మహేష్, ప్రసాద్‌రెడ్డి, స్రవంతి, గ్రామస్తులు రమ్యను అభినందించారు.


విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

లక్ష్మిరెడ్డి పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్యాపిలి: పట్టణంలోని వి.లక్ష్మిరెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థి జోనల్ స్థాయి అబాకస్ పోటీల్లో సత్తా చాటాడు. కర్నూలులో ఆదివారం జరిగిన పోటీల్లో రంగస్వామి జోనల్ స్థాయిలో మూడో స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం ఇనాయతుల్లా తెలిపారు. కరస్పాండెంట్ సంజీవరెడ్డి విద్యార్థిని అభినందించారు.

ఎంబాయి పెద్దమ్మకు బోనాలు


అమ్మవారి దర్శనం కోసం భారీగా వచ్చిన గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎంబాయి సమీపంలో వెలసిన పెద్దమ్మకు ఆదివారం గ్రామస్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగాపండి అందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. గ్రామస్తులు డోలు వాయిద్యాల నడుమ సామూహికంగా బోనాలు సమర్పించడానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులకు అన్నదానం చేశారు.


పూజలందుకున్న పెద్దమ్మ

శాస్త్రోక్తంగా సుదర్శన యాగం


సుదర్శన యాగం చేస్తున్న వేదపండితులు


ఇరుముడితో పాదయాత్రగా తిరుమలకు బయలు దేరుతున్న గోవింద భక్తులు

డోన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఘనంగా జరిగింది. గోవింద మాలధారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం గోవింద మాలధారులు ఇరుముడితో పాదయాత్రగా తిరుమలకు బయలుదేరి వెళ్లారు. ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాస రావ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములవుదాం

డోన్ టౌన్: సమాజంలో ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లాలని.. అప్పుడే నవ సమాజ నిర్మాణం సాధ్యం అవుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, డోన్ డివిజన్ అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికీ మూఢ నమ్మకాలతో ప్రజలు నష్టపోతున్నారని, దొంగ బాబాలను నమ్మి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ఏడాదిలో మద్యం, మాదక ద్రవ్యాలకు స్వస్తి పలికి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, బాబు, సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, అబ్దుల్ లతీఫ్, రామమూర్తి, చంద్రమోహన్, ఉమర్ పాల్గొన్నారు.


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్: స్థానిక గుత్తిరోడ్డులోని అమ్మ హోటల్ సమీపంలో గుర్తుతెలియని యువకుడు ఆదివారం ఉదయం మృతిచెందాడు. పట్టణ పోలీసుల అభ్యర్థన మేరకు ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, బట్ట బాబు ఆర్థిక సహాయం చేశారు. ఆత్మబంధువు సభ్యులు షాదిఖానా రాజు, గురుస్వామి, దాదాహుసేన్, శివారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రంగస్వామి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆత్మబంధువు సభ్యులు

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, రెడ్డిపల్లె, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రొట్టెల పంపిణీ

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం రోగులు, గర్భిణులు, బాలింతలు, సహాయకులకు రొట్టెలు, గుడ్డు, పప్పు పంపిణీ చేశారు. నందికొట్కూరు నియోజకవర్గం జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ ఆర్థిక సహాయంతో ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ వీటిని అందజేశారు.

ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాముడు

బనగానపల్లె రూరల్: ఏపీ ఎరుకల సేవా సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఈసారి రాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నంద్యాల పట్టణం ఎన్జీఓ కాలనీలో రాయలసీమ జిల్లాల ఎరుకల సేవా సంఘం అధ్యక్షుడు మానుపాటి సూర్యుడు, రాష్ట్ర అధ్యక్షుడు పాలపర్తి శ్రీనివాస చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ఎన్నిక జరిగింది. జిల్లాలో ఎరుకల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

డోన్ టౌన్: గురుకుల విద్యా ఫౌండేషన్ సౌజన్యంతో వివిధ రంగాల్లో స్త్రీ, పురుషులతో పాటు పిల్లలకు ఉపయోగపడే పలు కోర్సులపై జనవరి 2వ తేదీ నుంచి నెల పాటు ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివేకానంద సేవా సమితి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి తెలిపారు. పెద్దలకు ఆరోగ్యం, వస్తువుల తయారీ, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైన్, ఆహారం తయారీ, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ స్కిల్స్, ఆధ్యాత్మికం, పిల్లలకు ఫోనిక్స్, అబాకస్, సంగీతం, డ్రాయింగ్, కోడింగ్, మాథ్స్, యోగా, కూచిపూడి, వెస్టర్న్ డ్యాన్స్, చేతి రాత తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 31వ తేదీలోగా https://play.google.com/store/apps/details?id=freegurukul.org అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7207783331, 7207783332, 9441656609 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

శాలివాహన సంఘం అభివృద్ధికి సహకరించాలి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

డోన్ టౌన్: శాలివాహన సంఘం అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఆ సంఘం అధ్యక్షుడు కుమ్మరి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి ఓబులేసు, శేషఫణి కోరారు. అహోబిలం కుమ్మరుల అన్నదాన సత్రంకు సంబంధించిన నూతన క్యాలెండర్లను ఆదివారం పాతపేట రాములదేవాలయంలో ఆవిష్కరించారు. ప్రభుత్వాలు మారుతున్నా కుమ్మరుల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు లేదన్నారు. అర్హులైన కుమ్మరులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో అహోబిలం అన్నదాన సత్రం ఉపాధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి మధు, డోన్ సంఘం నాయకులు ఆంజనేయులు, నాగరాజు, మహేష్, లక్ష్మీనరసింహయ్య, మునిస్వామి పాల్గొన్నారు.

మంచుకురిసే వేళలో..


కొండపై లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కప్పేసిన పొగమంచు


లైట్ల వెలుతురులో ప్రయాణిస్తున్న వాహనాలు

కొలిమిగుండ్ల: కశ్మీర్ అందాలను తలపించేలా పొగమంచు దృశ్యాలు ఆదివారం కొలిమిగుండ్లలో ఆవిష్కృతమయ్యాయి. చక్కటి వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదించారు. కొండలు, రోడ్లు, జనవాసాలు, పంట పొలాలు ఇలా ఎటు చూసినా తెల్లటి పొగమంచు అందాలు కనిపించాయి. వాహనదారులు ఉదయం 8గంటల సమయంలో కూడా లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. చలికితోడు చిన్న నీటి తుంపర్లు పడడంతో ఆహ్లాదకరంగా మారాయి. బారెడు పొద్దెక్కినా సూర్యుడు పొగమంచును చీల్చుకొని ప్రసరించేందుకు సమయం పట్టింది. చాలా మంది ప్రజలు మిద్దెలపైకి ఎక్కి పొగ మంచు అందాలను తిలకించడమే కాక సెల్‌ఫోన్లలో బంధించారు.


నివాసాలు కనిపించకుండా ఏర్పడిన పొగమంచు

పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన బోయ పెద్దయ్యను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం పరామర్శించారు. బోయపెద్దయ్య ఇటీవల గుండె సంబంధిత చికిత్స తీసుకోవడంతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, సంజీవగౌడ్, వడ్డె సుబ్బరాయుడు, రవితేజ ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు


క్రీడాకారులతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు

డోన్ టౌన్: క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు, భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. డీఎస్పీ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలో ఆదివారం అండర్-20 జిల్లా స్థాయి కబడ్డీ క్రీడాకారులకు శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, వివిధ ప్రాంతాల క్రీడాకారులతో పరిచయం ఏర్పడుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరచి సత్తాచాటాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు జనవరి 2వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. జనవరి 3,4,5 తేదీల్లో కర్నూలులో జరిగే 50వ రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు మద్దిలేటిగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


కురవ సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణలో సీఐ

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని దత్తాత్రేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం మాదాసి కురవ, మాదారి కురవ క్యాలెండర్లను సీఐ ఇంతియాజ్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమలింగడు, కార్యదర్శి శివలింగం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదాసి కురవ, మాదారి కురవలను ఎస్సీలుగా గుర్తించడానికి జీఓ విడుదల చేసిందని.. వాటిని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసి ఎస్సీలుగా గుర్తించి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మద్దిలేటి, డోన్ పట్టణ అధ్యక్ష ఉపాధ్యక్షులు ప్రసాద్, అలేబాదు పెద్దరాజు, గౌరవ అధ్యక్షుడు గంగన్న, కార్యదర్శి మునిస్వామి, కోశాధికారి మేఘవర్ధుడు, రవికుమార్, బాలమద్దయ్య, వెంకట్రామయ్య, రవి మోహన్, పక్కీరప్ప పాల్గొన్నారు.

మురుగునీటితో సహవాసం



బీసీ, ఎస్సీ హాస్టల్ పక్కన ప్రవహిస్తున్న మురుగునీరు, రాజీవ్ నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు

డోన్: పట్టణంలోని కొండపేట బీసీ హాస్టల్ వద్ద డ్రైనేజీ నీరు తరచూ వీధుల్లో ప్రవహిస్తుండడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. చిగురుమానుపేట, కొండపేట, బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల పక్కన, రాజీవ్‌గాంధీ ప్రధాన వీధిలో కాల్వ వెంట డ్రైనేజీ నీరు నిల్వ చేరుతోంది. తరచూ కాలువలు బ్లాక్ అయి రోడ్లపై మురుగునీరు చేరుతున్నాయి. దీనికి తోడు నంద్యాల, డోన్ రైల్వే డబ్లింగ్ పనుల నిమిత్తం రైల్వే సరిహద్దు స్థలంలో ప్రహరీ నిర్మించడంతో డ్రైనేజీ వాటర్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న కాల్వలో వెళ్లే అవకాశం లేక ఇలా రోడ్లపై ప్రవహించడం పరిపాటిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీరు సజావుగా ప్రవహించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.